క్లుప్తంగా

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో ఎస్ఐ వెంకటరెడ్డి, ప్రసాద్ తదితరులు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలో శ్రీ సరస్వతి విద్యామందిరం రోడ్డులో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా యాగంటి బాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ ఉమాయాగంటేశ్వర చలివేంద్రాన్ని ట్రీటౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా బాబయ్య చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో బాబయ్య కుమారుడు శివ, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్రెడ్డి, ఆయూబ్‌ఖాన్, శివారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని నందిని క్లాత్‌మార్కెట్ వద్ద పద్మశాలీయ అభ్యుదయసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్‌వాటర్ చలివేంద్రాన్ని ఆదివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశాలీయ అభ్యుదయ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు సాధు అశోక్, చెన్నా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, కోశాధికారి అవ్వారు శ్రీనివాసులు, సంజీవ పాల్గొన్నారు.

• స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద బీసీ ప్రజాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రారంభించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, కార్యదర్శి దేవేంద్రుడు, కోశాధికారి మడక సంటెయ్య, కొత్తపల్లె శీను, బీసీ పుల్లయ్య, భాస్కర్, భాస్కర్‌రావు, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



డ్రైవర్లకు నిద్రమత్తు లేకుండా నీటితో వాష్ చేయిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

అట్లూరు: డ్రైవర్లు అప్రమత్తతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అట్లూరు ఎస్ఐ బి. రామకృష్ణ పేర్కొన్నారు. స్టాఫ్ అండ్ వాష్‌లో భాగంగా శనివారం రాత్రి గోపవరం మండల పరిధిలోని పీపీకుంట చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపి డ్రైవర్లకు నిద్ర మత్తు లేకుండా నీటితో ముఖం వాష్ చేయించి డ్రైవర్లు రాత్రి వేళ వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎక్కడ నిద్ర మత్తు వచ్చినా వాహనాన్ని నిలిపి నీటితో ముఖం వాష్ చేసుకోవాలని సూచించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో బీజేపీ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలో ఆదివారం బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకధార నరేంద్రరావు ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న జన సంఘ్ నుండి భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందన్నారు. నాడు ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ ప్రస్తుతం వరుసగా మూడో సారి దేశంలో అధికారంలో కొనసాగుతోందన్నారు. బీజేపీ మహిళా నాయకురాలు సీవీ జయలక్ష్మి, చెన్నా మోహన్, ముత్యాల శ్రీశ్రీ, వెంకటేశ్వర ప్రసాద్, రవి, ప్రకాష్ రెడ్డి, ప్రసన్న కుమారి, శివశక్తి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం భారతీయ జనతాపార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండా ఎగురవేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి



వెంకటస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: గిరినగర్‌కు చెందిన జల్లి వెంకటస్వామి (50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆదివారం మృతదేహం పోరుమామిళ్ల చేరింది. గురువారం రాత్రి మిరపకాయల లోడుతో ఆటోలో గుంటూరు పోతుండగా అర్ధవీడు దగ్గర రోడ్డు ప్రమాదంలో వెంకటస్వామి తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, వెంకటస్వామి మృతదేహానికి నివాళి అర్పించారు.



మైదుకూరు : విశేషాలంకరణలో మూల విరాట్‌లు



బి.కోడూరు : ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు



ప్రొద్దుటూరు రూరల్ : పూజలందుకుంటున్న దేవతామూర్తులు



ప్రొద్దుటూరు కల్చరల్ : ఆత్మారామస్వామి గ్రామోత్సవం

సీతారాముల కల్యాణం.. ఊరూరా సంబరం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తి శ్రద్ధలతో పూజలు

ప్రొద్దుటూరు : స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలులోని రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అలంకరించారు. స్వామివారిని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, 28వ వార్డు కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, మాడెం సందీప్, రామచంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వారు భోజనం వడ్డించారు.

అన్నదానం

బొల్లవరంలోని రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి కుటుంబీకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ 1938లో తన తండ్రి పుల్లారెడ్డి ఈ ఆలయాన్ని నిర్మించారని, నాటి నుంచి నేటి వరకు ఆలయంలో శ్రీరామ నవమి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోరెడ్డి సందీప్‌రెడ్డి, పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి దంపతులతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారుమునిరెడ్డి, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, గోనా ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల నాగేషారెడ్డి, శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

• సంజీవనగర్‌లోని రామాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లొడుగోళ్ల చిన్న ఓబులేసు దంపతులు శ్రీరామనవమి సందర్భంగా స్వామివారికి తలంబ్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అట్లూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముఖ్యంగా మహిళలు వేకువ జామునుంచే సంప్రదాయ బద్ధంగా రామాలయాల్లో పూజలు నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా కమలకూరు గ్రామంలో వెలసిన రామాలయంలో అంత్యంత భక్తి శ్రద్ధలతో వేద పండితులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం మండలంలోని ప్రతి గ్రామంలో నవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. చెంచయ్యగారిపల్లె, ఎర్రంపల్లె, కేశాపురం, పీసీపల్లె, గొడ్లవీడు, కందిమల్లాయ్యపల్లె, గంగిరెడ్డిపల్లె, చౌదరవారిపల్లె, చౌటపల్లె, బోడపాడు. తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. రాత్రికి పలుగ్రామాల్లో గ్రామోత్సవాలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరులో శ్రీకోదండ రామాలయంలో ఆదివారం సీతారాముల



ప్రొద్దుటూరు కల్చరల్ : మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకుడు

కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన కాచన బాబురెడ్డి, నిశాంతి దంపతులు కల్యాణం చేయించారు. అనంతరం అక్కడకు వచ్చిన భక్తులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాచన వెంకటసుబ్బారెడ్డి, సుభాష్‌రెడ్డి, లింగారెడ్డి, కాసా రాజశేఖర రెడ్డి, ఓబుళరెడ్డి, భక్తులు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వడపప్పు పంపిణీ

రాజుపాళెంలోని శ్రీకోదండ రామాలయంలో ఆలయ ధర్మకర్త సుంకు రామకష్టయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. సోమవారం జరగబోవు సీతారాముల గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలని ధర్మకర్త కోరారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు రామాలయాల్లో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. పానకం, వడపప్పు పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానిక శివాలయంలోని అభయ వరదా రామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా వేకువజామున సీతారాములు, లక్ష్మణుడు ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈట రామచంద్రాచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక కోనేటికాల్వ వీధిలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి ద్వారా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వామి, అమ్మవారికి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. మెయిన్ బజార్‌లోని ఆత్మారామస్వామి ఆలయంలో ఉదయం సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణలతో మంగళవాయిదాల మధ్య, ముత్యాల తలంబ్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత ఊరు శ్రీకోదండరామస్వామి ఆలయంలో, శ్రీరాంనగర్, గాంధీనగర్, అమ్మవారిశాల, నంద్యాల రోడ్డు, పార్వతినగర్, కరణం వీధి తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో మూల విరాట్లకు విశేషాలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాశినాయన : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు.

ఊరూరా శ్రీరామనవమి వేడుకలు

చాపాడు : మండల వ్యాప్తంగా ఆదివారం అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చాపాడు, సిద్ధారెడ్డి పల్లె, సీతారాంపురం, నాగాయపల్లె, మొరాయిపల్లె, పల్లవోలు, రాజుపాళెం, వెదురకూరు, విశ్వనాథపురం, రేపల్లె, టీటీపల్లె, మండల వ్యాప్తంగా రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు.

గోపవరం మండలంలో..

గోపవరం : మండల వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే ఆయా గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొని తిలకించారు. అనంతరం రాత్రి సీతారాముల విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వాడవాడల శ్రీరామనవమి వేడుకలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పరపల్లెలోని శ్రీసద్గురు సమర్థనారాయణ స్వామి ఆశ్రమంలో శ్రీరామనవమి సప్తాహ కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, మండలారాధన, కలశస్థాపన, శ్రీరామజన్మఘట్టపారాయణం, ఊయలసేవ, భజనలు చేశారు. అలాగే కానపల్లె గ్రామంలోని శ్రీరాములు, ఆంజనేయస్వామి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. లింగాపురంలోని యాదవ కాలనీలోని రామాలయంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఖాదర్‌బాద్ గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించి భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఖాజీపేట మండలంలో..

ఖాజీపేట : మండలంలో శ్రీరామనవమిని అత్యంత వైభవంగా భక్తులు నిర్వహించారు. అలాగే దుంపలగట్టు జరిగిన సీతారాముల కల్యాణ వేడుకల్లో బెంగళూరుకు చెందిన రిటైర్డ్ డీజీపీ చాగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రెడ్యం నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రతాప్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు రెడ్యం రవీంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణం

కలసపాడు : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని మహానందిపల్లె, మామిళ్ళపల్లె, శంఖవరం, చెన్నారెడ్డిపల్లె, ఎగువరామాపురం, తెల్లపాడు గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహానందిపల్లెలో పురోహితులు వారణాసి వెంకటరమణవరప్రసాద్ సీతారాముల కల్యాణం నిర్వహించారు.

రమణీయం .. రాములోరి కల్యాణం

బద్వేలు అర్బన్ : శ్రీరామనవమి పండుగను ఆదివారం పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. గాండ్లవీధి కోదండరామస్వామి దేవాలయం, అమ్మవారిశాల వీధిలోని రామాలయం, అబ్బరాతివీధిలోని కోదండ రామాలయం, సురేంద్రనగర్ పట్టాభిరామాలయం, శ్రీకృష్ణదేవరాయనగర్‌లోని రామమందిరం, రాజుగారివీధిలోని అభయాంజనేయస్వామి ఆలయం, ఆంజనేయనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, మడకలవారిపల్లెలోని రామాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అలాగే స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గల రామాలయంలో, గాండ్ల వీధిలోని కోదండరామస్వామి ఆలయం, సురేంద్రనగర్‌లోని పట్టాభిరామాలయం, అబ్బరాతివీధిలోని కోదండ రామాలయం, మడకలవారిపల్లెలోని రామాలయాలలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్సీ దంపతులు

పోరుమామిళ్ల: ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆయన సతీమణి తులశమ్మ, కుమారుడు గోపీనాథరెడ్డి రెడ్డి నగర్‌లోని రామాలయంలో ఆదివారం జరిగిన శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్సీ చెప్పారు. ఈ కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఆలయ అధ్యక్షుడు చాపాటి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు రామసుబ్బారెడ్డి, గంగన్న, ఓబుల్‌రెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి, సాయి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నాగార్జునరెడ్డి పూజలు

మండలంలోని చల్లగిరిగెల రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు.

వైభవంగా గ్రామోత్సవం

బి.కోడూరు : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని కోదండరామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని మేకవారిపల్లె, బి.కోడూరు, పందివీడు గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



అట్లూరు: కలమకూరులో సీతారాముల విగ్రహమూర్తులు



చాపాడు : సిద్ధారెడ్డిపల్లెలో సీతారాముల కల్యాణోత్సవం



ఖాజీపేట : రిటైర్డ్ డీజీపీని సత్కరిస్తున్న గ్రామస్తులు



ప్రొద్దుటూరు: పూజలు చేస్తున్న బంగారుమునిరెడ్డి, నాయకులు



పోరుమామిళ్ల: రామాలయంలో ఎమ్మెల్సీ దంపతులు



రాజుపాళెం: టంగుటూరులో సీతారాముల కల్యాణంలో భక్తులు



కలసపాడు : మహానందిపల్లెలో..



ప్రొద్దుటూరు కల్చరల్ : కళాకారుల ప్రదర్శన



గోపవరం: రాచాయపేటలో ..



కాశినాయన: నరసాపురంలో..



బద్వేల్ అర్బన్: సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు శివాలయంలో..

కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



టీడీపీ నాయకుడు కబ్జాకు పాల్పడిన ప్రభుత్వ భూమి ఇదే



యంత్రాలతో తొలగించిన భారీ వృక్షం

గోపవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల వ్యవధిలో ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా రాబందుల్లా వాలిపోతున్నారు. వంకలు, వాగులు సైతం కూడా వదలడం లేదు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోతుంది. చివరికి కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద స్థలాలను కూడా వదలడం లేదు. గోపవరం మండలం మడకలవారిపల్లె రెవెన్యూ పొలం 983 సర్వే నంబరులో నెల్లూరు – ముంబై జాతీయ రహదారికి పక్కనే కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రే భారీ యంత్రాలు ఉపయోగించి చదును చేశారు. బద్వేలు నియోజకవర్గ అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లోనే బి.కోడూరు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఈ భూ దందాకు పాల్పడ్డాడు. 983 సర్వే నంబర్‌లో 30 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉంది. ఇదే స్థలానికి సంబంధించి గతంలో రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేశారు. ఈ స్థలంలో తమకు కూడా పట్టాలు ఉన్నాయని 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడు భారీ యంత్రాలు ఉపయోగించి చదును చేస్తుండగా స్థానికులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెవెన్యూ అధికారులు అప్పట్లోనే ఇదే స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో రెండు వర్గాలకు చెందిన వారు కోర్టును ఆశ్రయించారు.

కోర్టు పరిధిలో ఉన్నా..

ప్రస్తుతం ఈ స్థలం కోర్టు పరిధిలో ఉంది. ఇప్పటి వరకు కోర్టు నుంచి ఎవరికి ఎలాంటి అనుమతులు రాలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కోర్టు పరిధిలో ఉన్నా అధికారపార్టీ నాయకుడు తిరిగి శనివారం రాత్రి వివాదాస్పద స్థలంలో యంత్రాలు ఉపయోగించి స్థలాన్ని చదును చేయడంతో పాటు అందులో ఉన్న భారీ వృక్షాలను కూడా తొలగించారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో ఈ భూ దందాకు పాల్పడ్డాడు. వివాదాస్పద స్థలం బద్వేలు మున్సిపాలిటీలో ఉండటమే కాక జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఎలాగైనా ఈ స్థలాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో కోర్టు నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికారంలో ఉన్నాం కదా.. ఏమి చేసినా అడ్డుకునేవారు లేరని దౌర్జన్యంగా యంత్రాలతో చదును చేసేందుకు పాల్పడ్డాడు. ఈ విషయంపై తహసీల్దారును వివరణ కోరేందుకు సాక్షి ప్రయత్నించగా అందుబాటులో లేరు. కోర్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

విద్య, వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కడప నగరంలోని హోచిమెన్ భవన్‌లో ఈనెల 26, 27, 28వ తేదీల్లో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి బత్తల పీటర్ కోరారు. స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆదివారం శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, విద్యార్థుల సంక్షేమం, శాస్త్రీయ విజ్ఞానం తదితర వాటిపై శిక్షణా తరగతుల్లో చర్చిస్తారని తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ సంయుక్త కార్యదర్శి నాని, ఉపాధ్యక్షుడు నాగేంద్ర, వాసు, సంజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.